క్లుప్తంగా

బోధనేతర పనులు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

ముమ్మిడివరం: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ఆర్థిక కార్యదర్శి పి.సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం బాలికోన్నత పాఠశాలలో శనివారం ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు పి.హిమబిందు అధ్యక్షతన మండల శాఖ విద్యాసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బరాజు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ నియమించాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు,ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాబులు



అమలాపురం టౌన్: ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన ఉపాధ్యాయుడు సరెళ్ల బాబులు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర వర్గ సమావేశం బాబులును ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అమలాపురానికి చెందిన బాబులు ప్రస్తుతం కొత్తపేట మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భౌతిక శాస్త్ర బోధనలో బాబులు వినూత్న పద్ధతులతో అనేక మంది విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. గతంలో బాబులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డును అందుకున్నారు. రాష్ట్ర సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, కోశాధికారి నరసింహారావు, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు బాబులును అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రసాదం పంపిణీని పరిశీలిస్తున్న ఈవో సత్యకుమార్

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈవోగా సత్యకుమార్ శనివారం అమలాపురంలో బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ అన్నదాన సమాజంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సత్యకుమార్ పదోన్నతిపై ఇక్కడికి ఈవోగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. శనివారం బాధ్యతలు స్వీకరించగానే సత్యకుమార్ దేవస్థానంలో అన్నదానం, ప్రసాద వితరణ తదితర విభాగాల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులుతో దేవస్థానం అభివృద్ధిపై చర్చించారు.

ఉపాధ్యాయ కొలువు సాధించిన యువకుడికి సత్కారం



మహేష్‌ను సత్కరిస్తున్న ప్రతాప్‌నగర్ గ్రామస్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధి సీతారామపురంలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు దుప్పి మహేష్ డీఎస్సీ-2025లో ఉత్తీర్ణత పొంది ప్రభుత్వ కొలువును సాధించాడు. మహేష్‌ది రెక్కాడితేగాని డొక్కాడని పేద కుటుంబం. అతని తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ కుమారుడిని చదివించారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మహేష్ రొయ్యల కంపెనీలో పనిచేస్తూ పట్టుదలతో చదివి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ పెయ్యల మంగేష్, శ్రీనివాస్, నవబుద్ధ యువజన సంఘం సభ్యులు మహేష్‌ను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు.

విలేజ్ అసిస్టెంట్ పరీక్షకు ఏర్పాట్లు

యానాం: విలేజ్ అసిస్టెంట్ అండ్ ఎంటీఎస్ (లీగల్ మెట్రాలజీ) పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శనివారం యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ అంకిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న ఈ పరీక్షకు యానాం రీజియన్ నుంచి 1,917 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. మొత్తం 7 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను పుదుచ్చేరి నార్త్ కలెక్టర్, అబ్జర్వర్ ఇషితారథీ తదితరులు పరిశీలించారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని అభ్యర్థులందరూ అరగంట ముందుగా పరీక్ష కేంద్రాలకు రావాలని అంకిత్‌కుమార్ సూచించారు.

దుకాణం ఒకరిది.. వ్యాపారం మరొకరిది

- యానాంలో బినామీల చేతిలో మున్సిపల్ షాపులు
- షాపులు చౌకగా లీజుకు తీసుకుని ఇతరులకు రూ.వేలల్లో అద్దెకు
- 135 షాపుల నుంచి నెలకు ఆదాయం రూ.1.80 లక్షల లోపే



యానాంలో మున్సిపల్ బస్టాండ్, లాడ్జి



పాత బస్టాండ్‌లో మున్సిపల్ షాపులు

యానాం: షాపులను అద్దెకు తీసుకున్న కొంతమంది తిరిగి వేరే వ్యక్తులకు వేలాది రూపాయలకు అద్దెకు ఇచ్చి జేబులు నింపుకోవడంతో రూ.లక్షల మేర యానాం మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది. కారుచౌకగా అద్దెకు షాపులు అద్దెకు తీసుకున్న వ్యక్తులు తమకు తెలిసిన వ్యక్తుల నుంచి లక్షలాది రూపాయల మేర అడ్వాన్సులు, రూ.వేలల్లో అద్దెలు తీసుకుంటూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. మున్సిపల్ షాపులకు ఉన్నతాధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రూ.900 నుంచి రూ.వెయ్యి వరకూ అద్దెలు

మున్సిపాలిటీకి చెందిన షాపులు నియోజకవర్గ పరిధిలో మొత్తం 135 ఉన్నాయి. పట్టణ పరిధిలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, సావిత్రినగర్, మార్కెట్ కాంప్లెక్స్, బాలయోగి కాలనీ, కనకాలపేట, గిరియాంపేట, ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్, శివారు గ్రామాలు తదితర ప్రాంతాల్లో షాపులు, రెండు లాడ్జిలు నిర్మించారు. అప్పటి నుంచి ఎప్పుడూ ఈ షాపులకు బహిరంగ వేలం నిర్వహించింది లేకపోవడంతో బినామీ వ్యక్తులు ఈ షాపులను నిర్వహించుకుంటున్నారు.

ఏటా రూ.60 లక్షల ఆదాయం కోల్పోతున్న వైనం

ముఖ్యంగా రాజకీయంగా పలుకుబడి, సిఫార్సులతో అతి తక్కువ అద్దెలతో ఈ షాపులను నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది పొందారు. వారి చేతుల్లోనే అనేక సంవత్సరాలుగా షాపులు ఉంటున్నాయి. ఏటా సుమారు రూ.60 లక్షల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 135 షాపుల్లో దాదాపు చాలా షాపులు బినామీల ఆధ్వర్యంలోనే ఉన్నాయి. వీరంతా షాపులను అద్దెకిస్తూ అక్రమంగా రూ.లక్షల ఆదాయం సంపాదిస్తున్నారు. దీనికి తోడు షాపులను ఖాళీ చేయకుండా వారివద్దే అట్టేపెట్టుకున్నారు. సుమారు 15 ఏళ్ల నుంచి ఇదే తంతు నడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీకి సంబంధిత వ్యక్తుల నుంచి అగ్రిమెంట్ లేకపోవడంతో ఇతరుల చేతిలో షాపులు ఉంటున్నాయి. కొత్త ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ సమస్యపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



మున్సిపల్ బస్టాండ్‌లో విరిగిపోయిన కుర్చీలు,

మున్సిపల్ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరవు

యానాం మున్సిపల్ బస్టాండ్‌కు ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించలేని దీనస్థితిపై విమర్శలు వస్తున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం యానాం కావడంతో మున్సిపల్ బస్టాండ్‌లోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాలకు రుసుము వసూలు చేస్తారు. బస్టాండ్ పైభాగంలో లాడ్జి ఉండటంతో అక్కడి నుంచి రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అయినప్పటికీ ప్రయాణికులు కూర్చోవడానికి సరైన కుర్చీలు ఏర్పాటు చేయలేదు. బస్సు వచ్చే వరకు ప్రయాణికులు నిలబడే ఉంటున్నారు. ఈ బస్టాండ్ నుంచి ఐ పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు తదితర మండలాల నుంచి, వివిధ లంక గ్రామాల నుంచి ప్రయాణికులు, వందలాది మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళతారు.

> **బహిరంగ వేలం నిర్వహించాలి**
>
> మున్సిపాలిటీకి చెందిన షాపులను కొంతమంది అద్దెకు తీసుకుని వాటిని వేరొకరి వద్ద లక్షల్లో అడ్వాన్సులు తీసుకోవడంతో పాటు వేలల్లో అద్దెకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. తక్షణం ప్రభుత్వం బినామీల నుంచి షాపులను స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించాలి. తద్వారా మున్సిపల్ ఆదాయం పెరుగుతుంది
>
> – సబ్బతి శ్రీనివాసరావు, యానాం

సురక్షిత, చట్టబద్ధ వలసలపై సదస్సు



సమావేశంలో పాల్గొన్న డీఆర్వో మాధవి తదితరులు

అమలాపురం రూరల్: కేంద్ర ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయిలో వలసదారుల సంక్షేమం – సురక్షిత చట్టబద్ధ వలసలపై విజయవాడలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం పాల్గొంది. విదేశీ ఉద్యోగాల కోసం వెళ్లే రాష్ట్ర వలసదారులలో సురక్షిత చట్టబద్ధ వలస, పాస్‌పోర్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించడం, ప్రవాస భారతీయుల సంక్షేమం, రక్షణ వంటి అంశాలపై చర్చించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి, నోడల్ ఆఫీసర్ కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కే మాధవి, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు, మేనేజర్ గొల్ల రమేష్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాన్సులర్ సేవల మెరుగుదలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు. విదేశీ వివాహాల్లో మోసపోయిన మహిళలు, ఏజెంట్ల మోసాలకు సంబంధించిన కేసుల పరిష్కారం తదితర అంశాలను అధికారులు వివరించారు.

ముగ్గురు శానిటరీ సిబ్బందికి షోకాజ్ నోటీసు



అమలాపురంలో షాపు ముందు చెత్త పోస్తున్న పారిశుధ్య కార్మికుడు (సీసీ కెమెరాలో)

అమలాపురం టౌన్: అమలాపురంలో పారిశుధ్య పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న శానిటరీ మేస్త్రీ, వార్డు సచివాలయ పారిశుధ్య విభాగం కార్యదర్శి, కార్మికుడిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ షోకాజ్ నోటీసులను శనివారం జారీ చేశారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద అన్న క్యాంటీన్ సమీపంలోని ఓ ఫ్రూట్ జ్యూస్ షాపు ముందు శానిటరీ మేస్త్రీ, వార్డు సచివాలయ పారిశుధ్య విభాగం కార్యదర్శి ఆదేశాలతో పారిశుధ్య కార్మికుడు చెత్తను పట్టుకుని వచ్చి వేసిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో శనివారం హల్‌చల్ చేయడంతో కమిషనర్ తొలుత వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ షాపు యాజమానిని వీరు డబ్బులు డిమాండ్ చేసినట్లు, ఆయన ఇవ్వకపోవడంతో షాపు ముందు చెత్త వేసినట్లు ఆరోపణలున్నాయి. షోకాజ్ నోటీసులు అందుకున్న 48 గంటల్లో వివరణ ఇవ్వాలని కమిషనర్ సూచించారు. వారి వివరణ ఆధారంగా తదుపరి చర్యలు, విచారణ నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. షాపు ముందు పేరుకుపోయిన చెత్త విషయంలో జరిగిన వివాదం కారణంగానే తాము చెత్త పోశామని శానిటరీ మేస్త్రీ చెబుతున్నారు.

అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద రేపు నిరసన

అమలాపురం రూరల్: తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమ మాదిరిగా అన్ని ప్రాంతాల్లో తయారుచేసి ప్రజల ప్రాణాలను హరిస్తోంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందించాలని వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వివిధ విభాగ సభ్యులు ముఖ్య నాయకులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, జిల్లా నాయకులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు



విలసవిల్లిలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: వ్యాధులు విజృంభించకుండా పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి తెలిపారు. విలసవిల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ మిశ్రమాన్ని చల్లారు. గ్రామంలో చెత్తను ఎక్కిడిక్కడ పడవేయకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ ఊర్మిళాదేవి గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో రాధే-11 జట్టు విజేత



గొల్లవిల్లిలో క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై రాజేష్, నిర్వాహకుడు పాపయ్యరాజు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారం రోజుల క్రితం ప్రారంభమైన నాగులపల్లి లక్ష్మీనారాయణ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో శనివారం నిర్వహించిన ఫైనల్ పోటీ హోరాహోరీగా జరిగింది. ముక్తేశ్వరానికి చెందిన రాధే- 11, అమలాపురానికి చెందిన జెర్సీ-7 రెండు జట్లకు ఫైనల్స్ పోటీ నిర్వహించారు. రాధే 11 జట్టు ఫైనల్స్‌లో విజయం సాధించింది.గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకుడు నాగులపల్లి పాపయ్యరాజు సమకూర్చిన బహుమతులను ఎస్సై సీహెచ్ రాజేష్ చేతుల మీదుగా అందించారు. ప్రథమ బహుమతిగా రూ.20 వేలు,ట్రోఫీ, రాధే- 11 జట్టుకు అందించారు. రెండవ బహుమతి రూ.10 వేలు జెర్సీ- 7 (రన్నర్స్) జట్టుకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రశాంత్‌కుమార్, హెచ్ఎం కనకదుర్గ, పీడీలు కామన మధుసూదన్, గొలకోటి ఫణీంద్ర, పీఏసీఎస్ చైర్మన్ చిక్కం ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



ట్రస్ట్ అధ్యక్షుడు సత్యనారాయణను సత్కరిస్తున్న కవి నరసింహమూర్తి, విజేతలు

అమలాపురం టౌన్: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించినప్పుడే వ్యక్తిత్వ వికాసం సాకారమవుతుందని అమలాపురం గుళ్లపల్లి వెంకట్రామయ్య, మహాలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక భూపయ్య అగ్రహారంలోని ట్రస్ట్ కార్యాలయంలో కామాక్షీ పీఠం ప్రేమమందిరం ఉంటూ కళాశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆయన ఆంగ్ల భాషలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించి ప్రసంగించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు ఆయన బహుమతులుగా అందజేశారు. ఆంగ్ల భాష తెలిసిన వారు కొత్త విషయాలను సులభతరంగా ఆకళింపు చేసుకుంటారని, వారిలో ఆత్మ విశ్వాసం ఉంటుందని సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ గుళ్లపల్లి ట్రస్ట్ విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్టును పంచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణను కవి నరసింహమూర్తి ఘనంగా సత్కరించారు. విజేతలైన విద్యార్థులు దేవర బాల, వారణాసి సాయి రమ్య, వడ్లమూరి షణ్ముఖ శ్రీహర్షిణి, మలిశెట్టి రుతి కార్తీక, ఆదిరాజు శ్రీరామచంద్రమూర్తిని కవి నరసింహమూర్తి అభినందించారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణ



వీరేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణ చేస్తున్న మహిళలు

ఐ.పోలవరం: శ్రీకృష్ణ పరివార సేవా సంఘం ఆధ్వర్యంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ శనివారం మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. కాకినాడకు చెందిన సంఘ నిర్వాహకులు పెద్దిబొట్ల సుధా మాధురి పర్యవేక్షణలో సుమారు 80 మంది మహిళలు పాల్గొని భగవద్గీత 123వ పర్యాయం పఠించారు.ప్రముఖ పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ భగవద్గీత ప్రచార కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు

అన్నదాన ట్రస్టుకు విరాళం

మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యం నిర్వహించే అన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన మదన్ మోహన్ సాహు రూ.10 వేలు శనివారం ఆలయ పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

సీఈసీ సభ్యుడు పితానికి ఘన సన్మానం



వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పితాని బాలకృష్ణను సన్మానిస్తున్న లక్ష్మీవాడ నాయకులు

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యుడు పితాని బాలకృష్ణను కాట్రేనికోన మండల వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తున్న పితాని బాలకృష్ణ సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి సీఈసీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించడంపై నాయకులు జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జగనన్న ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, లక్ష్మీవాడ సర్పంచి చొల్లంగి శ్రీలక్ష్మి, వెంకటేశ్వరరావు, సాకా బాలరాజు, కుంచే రాజు,గుత్తా సత్యనారాయణ, ఎలిపే డేవిడ్ రాజు తదితరులు ఉన్నారు.

ఏపీఆర్ఎస్ఏ డివిజన్ అధ్యక్షుడిగా అశోక్‌ప్రసాద్

అమలాపురం టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అమలాపురం డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. డివిజన్ అధ్యక్షుడిగా పలివెల అశోక్‌ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.వేణుగోపాలరావు, వి.వెంకట రామరాజు, జి.లలిత, ప్రధాన కార్యదర్శిగా వి.రవికిరణ్, సంయుక్త కార్యదర్శులుగా ఎంఏ అలీ, జి.సత్యవేణి, కె.వెంకటేష్, కోశాధికారిగా ఎం.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఆర్.నగూర్ మీరా సాహెబ్, జేవీవీఎస్ఎస్ విశ్వనాథం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎండీ అబ్రహీమ్ వ్యవహరించారు.

ఈడీసీ వైస్ చైర్మన్ కుటుంబానికి ఆర్థిక సహాయం



చొల్లంగిపేట విజయదుర్గ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న అటవీ శాఖాధికారులు

తాళ్లరేవు: చొల్లంగిపేట శ్రీ మురళీకృష్ణ ఈడీసీ వైస్ చైర్మన్ కె.విజయదుర్గ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి దాతలు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసారు. కోరింగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.సంధ్యారాణి, వి.విష్ణు తదితరులు ఆమె కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా చొల్లంగిపేట ఈడీసీ చైర్మన్ ఎం.సత్యనారాయణ, గ్రామ పెద్దల ద్వారా రూ.10 వేల నగదును విజయదుర్గ భర్త సన్యాశేశ్వరరావుకు అందజేసారు.

స్వామి సన్నిధిలో సినీనటుడు సునీల్



అంతర్వేది ఆలయంలో స్వామి లడ్డూ ప్రసాదం అందుకుంటున్న సునీల్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ కమిటీ సలహాదారుడు అనంతశయన దీక్షితులు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారికి ప్రముఖ సినీనటుడు సునీల్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సునీల్‌కు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలి

అలమూరు: నేటి సమకాలీన సమాజంలో సాంకేతిక అభివృద్ధి చెందుతున్న విధంగానే రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ఎస్సై జి.నరేష్ సూచించారు. ఆలమూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబర్ నేరాలు–తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతోను, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తరహా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే సత్వరమే 1930 నంబరు డయల్ చేసి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల సోషల్ మీడియాలోని వాట్సాప్ వేదికగా ఎస్‌బీఐ, రైతు భరోసా వంటి సేవా కేంద్రాలకు ఏపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమంటూ ఫోన్‌కాల్స్ వస్తున్నాయని ఎస్సై నరేష్ వివరించారు. ఆయాప్‌లో ఆధార్‌కార్డు, పాన్‌కార్డ్‌ను లింక్ చేసుకునే విధంగా సైబర్ నేరగాళ్లు మభ్యపెట్టి ఫోన్ హ్యాక్ చేసి వ్యక్తిగత డేటాను దొంగలిస్తూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు.

బాణసంచా అక్రమ నిల్వపై కఠిన చర్యలు

ఐ.పోలవరం: బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం పోలీసుస్టేషన్‌లో శనివారం మండలంలోని బాణసంచా షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ షాపు వద్ద అగ్నిమాపక రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, ఇసుక, నీటిని తగినంతగా అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సై రవీంద్రబాబు పాల్గొన్నారు.